

కబ్జాను అడ్డుకున్న అధికారులు

కురబలకోట, ఓబులవారిపల్లె మండలాల్లో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు అడ్డుకున్నారు. - 8లో



హలీం.. రుచికి గులాం

రంజాన్ మాసం వచ్చిందంటే చాలు... ముస్లింల ఉపవాసదీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు మాత్రమే కాదు. హైదరాబాద్ సంప్రదాయక వంటకమైన హలీం గుర్తుకువస్తుంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.84	రూ.104
రెండోరకం	రూ.50	రూ.82

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 182 మెట్రిక్ టన్నులు



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
రాజంపేట	6.31	4.55
రాయచోటి	6.31	4.52
మదనపల్లి	6.33	4.56
పీలేరు	6.28	4.49

భక్తాగ్రేసరుడు.. రామదాసుడు!

మాల ఓబన్న (భవనాసి ఓబులదాసు) ఒక దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి. రామభక్తుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. రామయ్యపై పాటలు పాడిన కారణంగా నాడు తీవ్ర వివక్షకు గురయ్యాడు. తన భక్తునికి జరిగిన అవమానంతో ఖిన్నుడైన స్వామి గర్భగుడిలో తన దిక్కును మార్చుకున్నాడని చరిత్ర చెబుతోంది. అప్పటి నుంచి ఓబులదాసు శ్రీరాముడి అపరభక్తునిగా నిలిచిపోయాడు.

- వావిలికొలను కన్నా ముందే రామభక్తుడు ఓబులదాసు
- ఓబన్న కీర్తనలవైపే 'రామయ్య'చూపు!
- గరుడోత్సవంలో ఓబన్నకు హారతి
- వారసులకు లభించని గౌరవం



సీతారామలక్ష్మణ మూలవిరాట్టు



రామాలయం ఎదురుగా ఉన్న మాలఓబన్న మంటపం

రాజంపేట: ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయానికి తూర్పు వైపున మాల ఓబన్న మంటపం కనిపిస్తుంది. ఇది రామ భక్తుడు భవనాసి ఓబులదాసు మంటపం. ఈయన వైష్ణవభక్తుడు. భవనాశి ఓబన్న ఆయన పూర్తిపేరు. నిత్యం ఈ గుడి సమీపంలో ఉంటూ స్వామి భజనలు చేసేవాడు. అంటరానివాడు.. దూరంగా నెట్టండి అని ఒక అధికారి ఓబన్నను అలయం పడమర వైపునకు నెట్టించాడు. ఓబన్న అక్కడున్న మంటపంలో నిలబడి పాటలు పాడుతూనే ఉన్నాడు. ఆ రాత్రి అలాగే సాగింది. ఉదయం అర్చకులు ఆలయ తలుపులు తెరవగా సీతారామలక్ష్మణ విగ్రహాలు పడమర వైపునకు తిరిగి ఉండటాన్ని గమనించాడు. తన భక్తుడైన ఓబన్నను అవమానించారనే కారణంగా స్వామి ఇలా తన దిక్కును మార్చుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తోంది.

అక్కడ రామదాసు..ఇక్కడ ఓబులదాసు.

తెలంగాణలోని భద్రాద్రి రామయ్యకు అపరభక్తునిగా రామదాసు చరిత్రలో నిలిచిపోయాడు. అలాగే ఒంటిమిట్ట రామయ్య భక్తుడిగా ఓబులదాసు కూడా చరిత్రలో నిలిచిపోయినప్పటికి ఆయనకు తగినంత ప్రాచుర్యం లభించలేదు. ఓబులదాసు రామయ్యపై కీర్తనలు ఆలపించాడని.. అయితే వాటిని రాతరూపంలో భద్రపరిచి ఉంటే ఈరోజు మరో అన్నమాచార్యునిగా ప్రసిద్ధికెక్కేవాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఓబన్న పుట్టుపూర్వోత్తరాలు..

ఒంటిమిట్టకు క్రోసుడు దూరంలో మలకాటిపల్లె హరిజన కుటుంబంలో భవనాసి ఓబులదాసు(మాల ఓబన్న) జన్మించాడు. వావిలికొలను సుబ్బారావు కన్నా ముందుగా రామభక్తుల వరుసలో ముందున్నాడు. ప్రతి నిత్యం పాటలు పాడుకుంటూ రాముని కైంకర్యంలో జీవించాడు. ఈయన గురించి తిరుమల తిరుపతి దేవస్థానం పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. కాగా బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున హారతి, బియ్యం, పసుపు, కుంకుమ వంటి పూజా సామగ్రి తమ వంశంవారి నుంచి స్వీకరించాలని ఓబన్న కోరినట్లు తెలుస్తోంది.



ఓబులదాసు (నమునాచిత్రం)

అవమానించిన అధికారికి కలలో..

ఓబన్నను అవమానించిన ఆ అధికారికి కలలో కోదండరామస్వామి కనిపించి మందలించాడు. ఉదయాన్నే అధికారి ఓబన్నను వేడుకొంటూ గుడి వద్దకు వచ్చాడు. స్వామి తూర్పు వైపు తిరిగి కనిపించాడు.

గరుడోత్సవం రోజున..

బ్రహ్మోత్సవాల సమయంలో గరుడోత్సవం నాడు స్వామి ఊరేగింపు బయటకు వచ్చినప్పుడు ఓబన్న స్వామికి హారతి పట్టడం నేటికి సంప్రదాయబద్ధంగా కొనసాగుతోంది.

ఓబన్న వంశీకులకు గౌరవమేదీ..

ఓబన్న వారసుల విషయంలో దేవదాయశాఖ గతంలోనూ, ఇప్పుడు టీటీడీ అదే తీరును అవలంబిస్తోందని దళితసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. వావిలికొలను సుబ్బారావు చరిత్ర తరహాలో ఓబులదాసు చరిత్రను బయటకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

పూర్వం నుంచి..

పూర్వం నుంచి ఆలయ నిర్వాహకులు ఓబన్న వంశీకులకు టెంకాయ, ఐదుపావుల బియ్యం, పూలదండ, కేజీనూనె ఇచ్చేవారు. గత కొంతకాలంగా రూ.3వేలు నగదు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

కల్యాణ వేదికపై ఓబన్న వారసులకు స్థానమేదీ?

కల్యాణ వేదికపై అన్నమయ్య వారసులను గౌరవించే తరహాలో ఓబన్న వారసులకు టీటీడీ నుంచి పిలుపులేదు. ఈ సారి స్వామివారి కల్యాణంలో మాలఓబన్న వంశస్తులకు పెద్దలతో పాటు స్థానం కల్పించాలనే డిమాండ్ దళిత నేతల నుంచి వినిపిస్తోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలన్న భావన వారిలో కనిపిస్తోంది.

ఓబులదాసు వారసులుగా జన్మించడం పూర్వజన్మ సుకృతం



ఓబులదాసు వారసులుగా జన్మించడం పూర్వజన్మ సుకృతం. తరతరాలుగా రామయ్య బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం గాలిగోపురం (తూర్పు) ఎదుట పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కొనసాగిస్తున్నాం. మమ్మల్ని వారసులుగా గుర్తించి స్వామి వారి కల్యాణ వేదికపై అవకాశం కల్పించాలి. –భవనాసి కాటయ్య, ఓబన్న వారసుడు

ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



రామదాసు తరహాలోనే ఓబులదాసు కూడా అపర రామభక్తుడు. అలాంటి భక్తునికి గుర్తింపు, ప్రాచుర్యం కల్పించడంలేదు. కనీసం విగ్రహమైనా ఏర్పాటు చేయాలి. –భవనాసి సుబ్బన్న, ఓబన్న వారసుడు

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట: ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఉదయం 5:00 నుంచి 5:30 వరకు సుప్రభాతం, 5:30 నుంచి 6 వరకు ఆలయ శుద్ధి, ఆరాధన, 6 నుంచి 7 గంటల వరకు సర్వదర్శనం, 7 నుంచి 7:30 గంటల వరకు ఆలయాన్ని నీటితో శుద్ధి చేశారు. అనంతరం ఆలయం ఎదురుగా వెలసిన సంజీవరాయుడు స్వామి ఆలయాన్ని కూడా ఆ పవిత్ర జలాలతో శుద్ధి చేశారు.

- ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు స్వామి వారి దర్శనం నిలిపివేశారు. తిరిగి 11 గంటల తరువాత నుంచి యధావిధిగా భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు, టీటీడీ సిబ్బంది ప్రవీణ్, రాజేంద్రనాయక్, అర్చకులు వీణారాఘవాచార్యులు, నరసింహాచార్యులు, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పవిత్ర జలంతో బలిపీఠాన్ని, ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ డిప్యూటీ ఈఓ

న్యూస్‌రీల్

సమష్టి కృషితో బ్రహ్మోత్సవాల నిర్వహణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండలంలో గల అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల విజయంతానికి సమష్టిగా కృషి చేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆదేశించారు. ఎంపీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే వేలాది భక్తులకు అత్యవసర చికిత్స అందించేందుకు ఎల్లవేళలా మండల వైద్యాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మేడా కన్‌స్ట్రక్షన్స్ తరపున దాదాపు 80 వేల అన్నప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఒంటిమిట్టలో నిత్య కల్యాణం జరుగుతున్న సందర్భంగా కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన వేదికపై దాదాపు 3 పెళ్లిళ్లు చేసుకోవచ్చన్నారు. ఇందుకు టీటీడీకి రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా పెళ్లికి నెల ముందే మేడా కన్‌స్ట్రక్షన్స్ వారితో మాట్లాడి నమోదు చేసుకుంటే టీటీడీకి చెల్లించాల్సిన మొత్తం రూ 10 వేలను తామే చెల్లిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

స్వామి పాదాలను తాకిన సూర్యకిరణాలు



సూర్యకిరణాలు స్వామి పాదాలను తాకే దృశ్యాన్ని చూస్తున్న భక్తులు

రాయచోటిటౌన్ : రాయచోటిలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామి విగ్రహ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. కిరణాలు స్వామి వారి ఆలయ ముఖ ద్వారం ద్వారా నేరుగా గర్భగుడిలోని స్వామి వారి పాదాలను స్పృశిస్తూ నాభి వరకు వెళ్లాయి. సుమారు పదిహేను సెకన్ల పాటు స్వామి వారి పాదాలను తాకాయి. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

రైల్వేశాఖ మంత్రి దృష్టికి రైళ్ల హాల్టింగ్ సమస్య



కేంద్రరైల్వేశాఖమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి

రాజంపేట: రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఐదు రైల్వేస్టేషన్లలో పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి కోరారు. మంగళవారం రైల్వేశాఖమంత్రితో ఆయన కార్యాలయంలో ఎంపీ భేటీ అయ్యారు. హాల్టింగ్స్‌కు సంబంధించి పూర్తి వివరాలతో మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు ఏ రైళ్లకు హాల్టింగ్స్ ఉన్నాయో వాటన్నింటిని పునరుద్ధరించాలని, అలాగే రైల్వేకోడూరు, ఓబులవారిపల్లెలో ఆర్‌యూబీ నిర్మించాలని కోరామన్నారు. ఇందుకు రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఎంపీతో పాటు గుంతకల్ రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

31న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని వైఎస్సార్ జిల్లా ఉపాధికల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, బీటెక్, ఎంబీఏ చదివిన యువతీ యువకులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు 19–40 ఏళ్ల మధ్య వయసు కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

హనుమంత వాహనంపై శ్రీరాముడి తేజసం

- ప్రియభక్తునిపై విహరించిన పట్టాభిరాముడు
- వైభవంగా ముత్యపు పందిరి వాహనం



హనుమంతునిపై ఊరేగుతున్న శ్రీరాముడు

వాల్మీకిపురం: వాల్మీకిపురం పట్టాభిరామస్వామి ఆలయంలో జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు మంగళవారం సీతాసమేత పట్టాభిరాముడు తన ప్రియభక్తుడైన హనుమంతునిపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, కొలువు, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు స్వామివారిని ముత్యపుపందిరి వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం 10 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహించి, సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల్ సేవ నయనానందకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గురుమూర్తి, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశ్యంత్, నాగరాజ, సిద్ధారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

స్వామివారికి ఘన స్వాగతం

మంగళవారం రాత్రి 8గంటలకు ఉత్సవర్లను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. హనుమంత వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు హనుమంత వాహనంపై విహరిస్తున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాఢ వీధుల్లో స్వాగతం పలికారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం 8గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 8గంటలకు సింహ వాహన సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 22,257 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 22,257 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలోని 92 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, ఒకేషన్ పరీక్షలకు సంబంధించి 23,351 మంది విద్యార్థులకుగాను 22,257 మంది హాజరు అయ్యారు. రాయచోటి ప్రాంతలోని పలు పరీక్షా కేంద్రాలలో చూచిరాతలకు పాల్పడిన 5 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్ఐఓ రమణరాజు తెలిపారు.

మత్తురహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

కలెక్టర్ గిరీషా పీఎస్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, పక్కన ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ తదితరులు

రాయచోటి: అన్నమయ్య జిల్లాను మత్తు రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవారం సాయంత్రం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లో నేషనల్ నార్కోటిక్స్ కో–ఆర్డినేషన్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. అజెండా అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు సమావేశంలో వివరించారు. నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో రాయచోటి, రాజంపేట, మదనపల్లి డివిజన్‌లలో 2021 నుంచి 2023 మార్చి వరకు 23 డ్రగ్ కేసులను నమోదు చేసి 150.53 కిలోల గంజాయి పట్టుకున్నామన్నారు. అలాగే 64 మంది నిందితులను గుర్తించామన్నారు. వీరిలో 24 మంది రిటైలర్లు, 27 మంది విక్రేతలు, 13 మంది వినియోగదారులను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ముఖ్యంగా యువతను దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని కళాశాలల్లో పోలీస్ శాఖ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు ఎవరూ బానిసలు కారాదన్నారు. వైద్య, ఆరోగ్యం, రెవెన్యూ, విద్య, అటవీ, డ్రగ్ తదితర శాఖల అధికారులు అందరూ పోలీస్ శాఖతో సమన్వయం చేసుకొని మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. జేసీ తమీమ్ అన్సారియా, డీఆర్ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు మురళీ, రంగస్వామి, డీఎస్పీలు సుధాకర్ రెడ్డి, శ్రీధర్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

రాజంపేట: పక్కా ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టరేట్‌లోని అన్నమయ్య సభా భవనంలో హౌసింగ్‌శాఖ అధికారులతో ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణం విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్య సమాజాన్ని నిర్మించుకుందాం

రాజంపేట రూరల్: సమాజంలోని దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకుని ఆదుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్య సమాజాన్ని నిర్మించుకుందామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో మంగళవారం టీబీ పేషెంట్లకు పోషకాహార పదార్థాల కిట్స్ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవన విధానాలను పాటించాలన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దాదాపు 100 మంది టీబీ పేషెంట్లను 6 నెలల పాటు దత్తత తీసుకున్నామన్నారు. సబ్ కలెక్టర్ అహమ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, డీఎంహెచ్ఓ కొండయ్య, అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ, డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎస్.చిన్నికృష్ణ, రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ వంకన గురుప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి పి.జనార్దన రెడ్డి, ట్రెజరర్ మిరియం శ్రీనివాసయాదవ్, మాజీ అధ్యక్షుడు ఓవీ శివారెడ్డి పాల్గొన్నారు.



క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

పని వారే దొంగతనం చేసి..

– సీసీ కెమెరాల్లో బయటపడ్డ వైనం

మదనపల్లె : కంచె చేను మేసిందన్న చందాన.. పని వారే దుకాణంలో దొంగతనానికి పాల్పడ్డారు. టూటౌన్ సీఐ ఎస్.మురళీకృష్ణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రాధాకృష్ణ సిల్క్స్ వస్త్ర దుకాణంలో కొంత కాలంగా స్టాక్‌లో తేడాలు వస్తుండటంతో.. అనుమానించిన యజమాని ఉప్పు రామచంద్ర సీసీ కెమెరాలను పరిశీలించారు. దుకాణంలో కొంత కాలంగా పని చేస్తున్న సమీరాభాను, గాయత్రి, లక్ష్మీపవిత్ర రూ.1 లక్ష 60 వేల పట్టుచీరలను పట్టుకెళ్లినట్లు తేలింది. దీంతో యజమాని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ముగ్గురిపై వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ


– తండ్రి, తనయుడికి తీవ్ర గాయాలు

రామాపురం : బైక్‌ను లారీ ఢీకొనడంతో తండ్రి, తనయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిలోని బీసీ కాలనీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో సూరి(28), ఆయన తనయుడు భరత్(4)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

ఓబులవారిపల్లె : గోవిందంపల్లె పంచాయతీ పోలివండ్లపల్లె దళితవాడ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్వర్లు పోలివండ్లపల్లె గ్రామ పరిసరాల్లో కూలి పనులు చేసుకొని జీవనం సాగించే వాడు. ఆయనకు శివప్రసాద్ అనే కుమారుడు ఉన్నాడు. ఈ నెల 24న బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. ఆయన కోసం బంధువులతో కలిసి శివప్రసాద్ చుట్టుపక్కల గాలించగా.. యాల్లాయపల్లె గట్టుపై శవమై కనిపించాడు. అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే తన అన్నను కుమారుడు శివప్రసాద్ హత్య చేశాడని అనుమానం ఉందని మృతుడి తమ్ముడు నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

హలీం.. రుచికి సలాం



- రంజాన్ ప్రత్యేక వంటకంగా గుర్తింపు
- ఊరూరా వెలుస్తున్న హలీం సెంటర్లు
- బలవర్థక ఆహారం కావడంతో ఆసక్తి చూపుతున్న ప్రజలు
- వేడివేడిగా ఘుమఘుమలాడే రుచిని ఆస్వాదిస్తున్న వైనం



వేడివేడిగా తయారవుతున్న హలీం వంటకం

మదనపల్లె సిటీ : రంజాన్ మాసం వచ్చిందంటే చాలు... ముస్లింల ఉపవాసదీక్షలు, ప్రత్యేక ప్రార్థనలు మాత్రమే కాదు. హైదరాబాద్ సంప్రదాయక వంటకమైన హలీం గుర్తుకువస్తుంది. ఒకప్పుడు కేవలం అక్కడికే పరిమితమైన ఈ వంటకం మెల్లమెల్లగా ఇతర ప్రాంతాలకు విస్తరించింది. ఇప్పుడు చిన్న చిన్న పట్టణాల్లో సైతం హలీం తయారీ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. ఉపవాసదీక్షలు జరిగే నెల రోజుల పాటు ముస్లింలే కాకుండా సాధారణ జనాలు సైతం ఈ రుచికి సలాం అంటున్నారు. రంజాన్ మాసం ఎప్పుడెప్పుడు వస్తుందా... హలీం ఎప్పుడు తిందామా అంటూ ఎదురు చూస్తారంటే అతిశయోక్తి కాదు. మదనపల్లె పట్టణంలో రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటైన హలీం కేంద్రాలపై ప్రత్యేక కథనం.

రుచిలోనే కాదు చరిత్ర అద్భుతమే..

హలీం వంటకం అరబ్ దేశమైన పర్షియా నుంచి హైదరాబాదుకు చేరుకుంది. ఆరో నిజాం నవాబు మహబూబ్ అలీఖాన్ తన సంస్థానంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పర్షియా నుంచి ప్రత్యేక ఆహ్వానితులు వచ్చారు. రంజాన్ ఉపవాసదీక్షల్లో ఇఫ్తార్‌కు తయారు చేసే వంటకాల్లో ఓ ప్రత్యేక వంటకం గురించి ప్రస్తావించారు. వెంటనే నవాబు షాహీ దస్తర్ ఖానా సిబ్బందిని పిలిపించి ఆ వంటకాన్ని సిద్ధం చేయించారు. అదే హలీం. పర్షియా నుంచి పరిచయమైన హలీం హైదరాబాదు మీదుగా నేడు అన్ని ప్రాంతాల్లో లొట్టలేసుకుంటూ ఆరగించే రంజాన్ వంటకంగా గుర్తింపు పొందింది.

తయారీ ప్రత్యేకమే

సంప్రదాయక వంటలతో పోలిస్తే హలీం తయారీ ఆద్యంతం ప్రత్యేకమే. దీనికి కనీసం 9 గంటల సమయం పడుతుంది. హలీం వంటకంలో మటన్ లేదా చికెన్, గోధుమలు, అన్ని పప్పులు, బాస్మతిబియ్యం, నెయ్యి, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, యాలకులు, దాల్చినచెక్క, మిరియాలు, కొత్తిమీర, నూనె, డ్రైఫ్రూట్స్ తదితర వస్తువులను వినియోగిస్తారు. ముందుగా గిన్నెలో మాంసం, నీటిని కలిపి బాగా ఉడికిస్తారు. అనంతరం గోధుమలు, బాస్మతిబియ్యం, పప్పులు, అల్లంవెల్లుల్లి పేస్ట్, మసాలా దినుసులు, పచ్చిమిర్చి బాగా ఉడికించి మెత్తగా దంచుతారు. అనంతరం సమపాళ్లలో నెయ్యి కలుపుతారు. వేడివేడిగా వేయించిన ఉల్లిపాయలు, నిమ్మ ముక్కతో పింగాణీ ప్లేటులో వడ్డిస్తారు. చికెన్ హలీంను హరీస్‌గా పిలుస్తారు.

బెంగళూరు బస్టాండులో....

పట్టణంలోని బెంగళూరు బస్టాండులో జామియా మసీదు సమీపంలో రంజాన్ ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు అందుబాటులో ఉండేలా ఐదు కేంద్రాలు, కదిరిరోడ్డులో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో రుచికరమైన చికెన్‌హలీం రూ.100కు, మటన్ హలీం రూ.150కు లభిస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి.



హలీం వేస్తున్న తయారీదారుడు

పోషకాలెన్నో...

హలీం రుచికే కాదు. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని పోషకాలు శరీరానికి ఎంతోమేలు చేస్తాయి. ఒక కప్పు హలీంలో 365 క్యాలరీలు, కొవ్వు నుంచి లభించే క్యాలరీలు 150 లభిస్తాయి. మొత్తం కొవ్వు 17 గ్రాములు, కొలెస్ట్రాల్ 51 మిల్లీగ్రాములు, సోడియం 580 మిల్లీగ్రాములు, పొటాషియం 410 మిల్లీగ్రాములు, కార్బోహైడ్రేట్లు 29.50 గ్రాములు, డైటరీ ఫైబర్ 9 గ్రాములు, షుగర్స్ 2.75 గ్రాములు, ప్రోటీన్‌లు 28.00 గ్రాములు లభిస్తాయి.

రుచి అమోఘం



రంజాన్ మాసంలో దొరికే హలీం రుచి అద్భుతంగా ఉంటుంది. నోట్లో పెట్టగానే మెత్తగా, రుచిగా అనిపించే ఈ వంటకం ఆరోగ్యానికి ఉపయోగకరమని వైద్యులు చెప్పడంతో ప్రతి సంవత్సరం కచ్చితంగా తినడాన్ని అలవాటు చేసుకున్నాను. గతంలో హైదరాబాదుకు ఎవరైనా వెళితే వారితో ప్రత్యేకంగా తెప్పించుకునే వాడిని. ఇప్పుడు ఇక్కడే దొరుకుతుండటంతో ప్రతి రోజు సంతోషంగా ఆరగిస్తున్నాను.

– మహమ్మద్‌ఖాన్, టీచర్, మదనపల్లె.

క్వాలిటీలో రాజీపడకుండా తయారీ



హలీం వంటకంపై ఆహారప్రియులకు ఓ విశేషమైన అభిప్రాయం ఉంది. వారి అంచనాలకు తగ్గట్లుగా హలీంను తయారు చేస్తేనే ఆదరణ ఉంటుంది. అందుకే తయారీలో ఏమాత్రం రాజీపడకుండా నాణ్యమైన దినుసులను, స్వచ్ఛమైన పదార్థాలను వాడుతూ ప్రజలకు నాణ్యమైన వంటకాన్ని అందించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– ఖాదర్‌ఖాన్, తాజ్ ప్యారడైజ్, మదనపల్లె.

దుబాయ్‌లో కంపెనీ పేరుతో మోసం

ప్రైవేట్ కళాశాల కరస్పాండెంట్ నుంచి రూ.1.07 కోట్లు స్వాహా

మదనపల్లె : దుబాయ్‌లోని ఫ్రీ ట్రేడ్ జోన్ అయినటువంటి రసల్‌ఖైమాలో కంపెనీ పెడదామని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నుంచి ఓ వ్యక్తి రూ.1.07 కోట్లు విడతల వారీగా ఆన్‌లైన్‌లో డబ్బు తీసుకుని మోసం చేసిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. పట్టణంలోని ఎస్‌వీఆర్ వీధికి చెందిన షేక్ జావీద్ దాదాసాహెబ్(44) బి.కొత్తకోటలో ప్రైవేట్ డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్నారు. ఆయనకు పట్టణంలోని దర్బీపేటకు చెందిన ఇషాక్ అహ్మద్ బాడీగార్డ్ సివిల్ ఇంజనీర్‌గా పరిచయమయ్యాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య పరిచయాలు పెరగడంతో... దేశంలోని పలు పెద్ద పెద్ద వ్యాపార సంస్థలతో తనకు పరిచయాలు ఉన్నాయని, వారు తనతో జరిపిన సంప్రదింపులకు సంబంధించిన నకిలీ మెయిల్స్, ఇతర రుజువులను చూపి షేక్ జావీద్ దాదాసాహెబ్‌ను దుబాయ్‌లో కంపెనీ పెడదామని నమ్మించాడు. జావీద్ సమకూర్చిన డబ్బులతో ఇషాక్ అహ్మద్ విజిటర్స్ వీసా తీసుకుని రసల్‌ఖైమాలో కంపెనీ ఏర్పాటుకు 2019 జూన్‌లో వెళ్లాడు. తర్వాత కంపెనీ కోసమని పలుమార్లు ఆన్‌లైన్ ద్వారా జావీద్ ఇషాక్‌కు డబ్బులు పంపుతూ వచ్చాడు. జావీద్ పంపిన డబ్బులతో ఇషాక్ మలక్ ఇంటర్నేషన్ ఎఫ్‌జెడ్‌ఎల్‌ఎల్‌సీ పేరుతో దుబాయ్‌లో కంపెనీని ప్రారంభించినట్లు చెప్పాడు. వ్యాపార లావాదేవీల కోసం జావీద్ నుంచి రూ.1.07 కోట్ల వరకు వసూలు చేశాడు. కొంతకాలం తర్వాత కంపెనీ వ్యవహారాలపై ఇషాక్‌ను జావీద్‌సాహెబ్ కోరితే సరైన వివరాలు పంపలేదు. దీంతో అనుమానం వచ్చి విచారణ చేస్తే ఇషాక్ చేతిలో దారుణంగా మోసపోయినట్లు తెలిసింది. దీంతో ఇషాక్‌ను తన డబ్బును తిరిగి చెల్లించాల్సిందిగా కోరాడు. అయితే దానికి అతను నిరాకరించి ఫోన్‌లోనూ అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో జావీద్ దాదా సాహెబ్ నేరుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్‌ను కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించాడు. ఆయనకు అందజేసిన అర్జీని మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లోనూ ఇవ్వడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఇషాక్ అహ్మద్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో 'స్వచ్ఛభారత్'

చిన్నమండెం : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా నాలుగో రోజు మంగళవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. విద్యార్థులనుద్దేశించి ఎస్‌ఐ రమేష్‌బాబు మాట్లాడుతూ పోలీసుల పనితీరు, వ్యవస్థలో వారు చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఎన్ఎస్ఎస్ పీఓ నవీన్‌కుమార్, ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

'ముదివేడు' బాధితులకు పరిహారం విడుదలకు చర్యలు

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

కురబలకోట : రూ.759 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కరువు రైతుల కల్పతరువు ముదివేడు రిజర్వాయర్‌కు భూములు కోల్పోతున్న నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం నిధులు విడుదల చేసేందుకు సర్వం సిద్ధం చేసిందని హెచ్‌ఎన్ఎస్ఎస్ యూనిట్–2 పీలేరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 20 రోజుల్లోగా నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. పిచ్చలవాండ్లపల్లె గ్రామ రైతులకు రూ.45 కోట్లు, ముదివేడు గ్రామ రైతులకు రూ. 95 లక్షలు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ అవుతాయన్నారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీకి ఆర్డీఓ స్థల పరిశీలన

రిజర్వాయర్ బాధితుల పునరావాసానికి కూడా శరవేగంగా చర్యలు చేపట్టినట్లు మదనపల్లె ఆర్డీఓ మురళి తెలిపారు. బాధిత రైతులు కోరిన మేరకు ముదివేడు ఫారెస్టు వద్ద ఎంబిజీ ప్లాంట్ పక్కన 25 ఎకరాలకు పైగా ఆర్ అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటుకు భూములను ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎం. భీమేశ్వరరావు మాట్లాడుతూ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో బాధితులకు త్వరలో పరిహారం నిధులు మరో వైపు సత్వరం పునరావాస కల్పనకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆర్ఐ సుగుణ, సర్వేయర్ భువనేశ్వరి, వీఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, కులదీప్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. స్థానిక ఏఐటీఎస్‌లో నాలుగో సంవత్సరం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థుల వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల పాటు చదివిన చదువుకు ఫలితం ఉద్యోగం సాధించడం మాత్రమేకాదని, ఉన్నతమైన ఆశయాలతో సమాజానికి, దేశానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడం కూడా అన్నారు. వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను, సమాజాన్ని, దేశాన్ని మరిచిపోరాదన్నారు. ప్రిన్సిపాల్ నారాయణ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో దేనినైనా సాధించగలరన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఓడీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం



మృతి చెందిన బాలగోవర్ధన్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రాజీరెసిడెన్సీ వద్ద మంగళవారం రాత్రి లారీ ఢీకొని బాలగోవర్ధన్ (32) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చియ్యవరానికి చెందిన రాజారావు కుమారుడు బాలగోవర్ధన్ కొన్ని నెలలుగా పట్టణంలోని ఉంగరాల నగర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజీరెసిడెన్సీ దారి నుంచి నడిచి వెళుతుండగా కడప నుంచి తిరుపతికి వెళ్తున్న సిమెంట్ రవాణా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు సంఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితంలేని యువతి అప్పగింత

పులివెందుల టౌన్ : ఒంటరిగా తిరుగుతున్న మతి స్థిమితం లేని యువతిని పోలీసులు మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. పులివెందుల పట్టణంలోని కడప రోడ్డులో పది రోజుల నుంచి పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన లక్ష్మీప్రసన్న అనే మతి స్థిమితం లేని యువతి తిరుగుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు పోలీసులకు సమాచారం ఇచ్చి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఆ యువతిని అప్పగించారు. ఎస్‌ఐ చిరంజీవి చొరవ తీసుకుని యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

చియ్యవరం వడ్డిపల్లెలో చిరుత సంచారం





పశువులపై దాడికి చేయడానికి చిరుత వచ్చిన దారిని చూపుతున్న రైతులు, చిరుత పాద ముద్రలు

రైల్వేకోడూరు రూరల్ : మండల పరిధిలోని చియ్యవరం వడ్డిపల్లె పరిసర ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. చియ్యవరం వడ్డిపల్లె రైతుల తోటల్లో ఉన్న మూడు పశువుల దొడ్ల వద్ద మూడు రోజులుగా రాత్రిళ్లు చిరుత వస్తోందని, తామంతా కాపలా ఉండి తరిమితే పక్కనే ఉన్న ఏటిలోకి వెళుతోందని పాడి రైతులు వాపోతున్నారు. సోమవారం రాత్రి కూడా వచ్చిందని రైతులు అంటున్నారు. రాత్రుళ్లు పంటలకు నీరు పెట్టేందుకు కూడా ఇబ్బందిగా ఉందని వారు వాపోతున్నారు. సమాచారం బయటికి రావడంతో చుట్టపక్కల గ్రామాల ప్రజలు కూడా బెంబేలెత్తుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రైతులకు, ప్రజలకు నష్టం జరగకుండా చూడాలని వారు వేడుకుంటున్నారు.

కబ్జాను అడ్డుకున్న అధికారులు

ప్రభుత్వ భూమి ఖాళీగా కనిపిస్తే చాలు.. కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. స్థలాల ధరలు పెరిగిపోవడంతో ఈ తంతు మరింత పెరిగింది. అయితే అధికారులు వీరికి ఎప్పటికప్పుడు చెక్ పెడుతున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడుతున్నారు. ఇలాంటి సంఘటనలు మంగళవారం కురబలకోట, ఓబులవారిపల్లె మండలాల్లో చోటుచేసుకున్నాయి.

కురబలకోట : కురబలకోట మండలం కడప క్రాస్ సమీపంలో హైవే పక్కనున్న వైఎస్సార్ కాలనీలో భూకబ్జాకు పాల్పడుతున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ సుభాషిణి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ 422 సర్వే నంబరులో 163 మంది లబ్ధిదారులు పక్కా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కాలనీ ముందర హైవే పక్కన ప్రజోపయోగ అవసరాలకు అధికారులు 30 సెంట్ల భూమి వదిలారు. హైవే పక్కన విలువైన స్థలంగా గుర్తించిన కొందరు దీనిపై కన్నేశారు. రెండు రోజుల క్రితం రాత్రికి రాత్రే పునాది రాళ్లు తోలారు. జేసీబీతో పునాదులు తీశారు. కట్టడాలకు ప్రయత్నించారు. భూ కబ్జాదారులు ఏకంగా కాలనీకి కూడా దారి లేకుండా పునాదులు తీశారు. తెలుసుకున్న కాలనీ వాసులు తిరగబడ్డారు. స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. వారు రెవెన్యూ అధికారులకు తెలిపారు. ఇది విలువైన ప్రభుత్వ భూమి కావడంతో కబ్జాకు యత్నించారని విచారణలో వెల్లడైంది. తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు ఆదేశాలతో ఆ పునాదులను వెంటనే పూడ్చి వేశారు. అంతేకాదు కాలనీలో ప్రజోపయోగం కోసం కేటాయించిన సదరు భూమిలో ఎవ్వరూ ప్రవేశించరాదని మంగళవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా మండలంలో ప్రభుత్వ భూములను కబ్జా చేయడం, విక్రయించడం చేస్తే తమ దృష్టికి తీసుకు రావాలని తహసీల్దారు కోరారు.



పునాదులు తీసిన ప్రాంతంలో విచారణ చేస్తున్న అధికారులు



జేసీబీతో చేస్తున్న పనులను అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

జేసీబీలతో భూమి చదును చేస్తుండగా..

ఓబులవారిపల్లె : పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలోని పీ కమ్మపల్లెలో సర్వే నంబర్ 1150లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసే ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. 20 ఎకరాల్లో కొందరు మంగళవారం ఉదయం నుంచి రెండు జేసీబీలతో పిచ్చిమొక్కలను తొలగించే పనులు చేపట్టారు. ఈ విషయం తెలిసిన తహసీల్దార్ పీర్ మున్ని తన సిబ్బందిని పంపించి పనులను అడ్డుకున్నారు. రికార్డుల పరంగా ప్రభుత్వ భూమిగా ఉందని తహసీల్దార్ తెలిపారు. మీ వద్ద ఉన్న ఆధారాలు చూపించాలని ప్రశ్నించారు. లేనిపక్షంలో రెండు జేసీబీలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములు కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.